కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

నరసాపురం: జిల్లాలో కాలుష్యం నివారణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లా కాలుష్యం కోరల్లో చిక్కుకుని రెడ్‌జోన్‌గా మారిందన్నారు. కేన్సర్ రోగులతోపాటు కిడ్నీ బాధితులు రోజురోజుకీ పెరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం బారిన నుండి ప్రజలను ప్రభుత్వం కాపాడాలన్నారు. ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి పేరిట ఎడాపెడా టోల్‌గేట్లు పెట్టి ప్రజలపై మోయలేని భారం మోపడానికి సిద్ధమయ్యారన్నారు. అదానీ కంపెనీకి మేలు చేసేందుకే స్మార్ట్ మీటర్లను తెరపైకి తీసుకొచ్చారని, దీనివల్ల ప్రజలపై పెనుభారం పడుతుందన్నారు. ఈ భారాలన్నింటికీ వ్యతిరేకంగా రానున్న రోజుల్లో సిపిఎం చేపట్టే ఆందోళనల్లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి భీమవరం బాలోత్సవం

కార్యక్రమాన్ని ప్రారంభించనున్న కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి - హాజరుకానున్న ఎంఎల్‌సిలు వెంకటేశ్వరరావు, గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉరుకులు, పరుగుల జీవితంలో మానవ సంబంధాలు, కుటుంబ, స్నేహ బంధాలు, సేవాగుణం రాను రాను సన్న గిల్లుతోంది. చిరునవ్వులు చిందించే చిన్నారులు సైతం ఆ చిరునవ్వుకు దూరమవుతున్న పరిస్థితి. ఆధునిక ప్రపంచంలో బాలల ప్రతిభాపాటవాలు, శక్తి యుక్తులు పెరుగుతూ వస్తున్నప్పటికీ ఆటపాటలు, వ్యాయామం వంటివి తగ్గిపోవడంతో పిల్లలపై మానసిక ఒత్తిడి పెరిగి ఆందోళనకర పరిస్థితులకు దారి తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో చక్కటి వాతావరణంలో సృజనాత్మకతను, శాస్త్ర సాంకేతిక పరిశోధన పట్ల ఉండే ఆసక్తిని ప్రోత్సహించాలనే ముఖ్యోద్దేశంతో విద్య, సాంస్కృతిక అంశాల్లో ఒకేసారి ఒకే చోట భీమవరంలో భీమవరం బాలోత్సవాలు నిర్వహించనున్నారు. నేటి నుంచి రెండు రోజులపాటు 2వ పిల్లల సంబరాలకు నిర్వహణ కమిటీ అన్ని ఏరాట్లూ పూర్తి చేసింది. సుమారు 3000 మంది విద్యార్థులు, చిన్నారులు వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలి రానున్నారు.

భీమవరం బాలోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ఆటపాటలతో అలరించి ఆలోచింపజేసే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా, ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రుల్లో సైతం సమాజం పట్ల నూతన ఒరవడిని కొనసాగించాలనే ఉద్దేశంతో బాలోత్సవాలు చేపట్టడం జరిగింది. వివిధ స్వచ్ఛంద సేవా, సామాజిక సంస్థల భాగస్వామ్యంతో ఈ నెల 28, 29 తేదీల్లో భీమవరం బాలోత్సవాలు నిర్వహించనున్నారు. డిఎన్‌ఆర్ కళాశాల గ్రౌండ్ ఎదురుగా ఉన్న చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హై స్కూల్ బాలోత్సవాలకు వేదికైంది. ఈ రెండు రోజుల్లో సుమారు 3000 మంది వరకూ చిన్నారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొనున్నారు. భీమవరం, ఉండి నియోజకవర్గాలకు చెందిన భీమవరం మండలం, భీమవరం, వీరవాసరం, పాలకోడేరు, కాళ్ల, ఉండి, ఆకివీడు మండలాల్లోని చిన్నారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బాలోత్సవాల్లో పాల్గొనున్నారు. ఇప్పటికే బాలోత్సవాల కమిటీ అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. బాలోత్సవాల పోస్టర్, లోగోలను ఆవిష్కరించడంతోపాటు వివిధ ప్రాంతాల్లో వివిధ ఆటల పోటీలు నిర్వహించి బాలోత్సవాలకు సన్నద్ధం కావాలంటూ నిర్వహణ కమిటీ ఎంతో కషి చేసింది. ఈ సంబరాలను మొదటిరోజు కలెక్టర్ చదలవాడ నాగరాణి, రెండో రోజు జిల్లా ఎస్‌పి నయీమ్ అస్మి ప్రారంభించనున్నారు. అలాగే ముఖ్యఅతిథులుగా ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు (ఐవి), ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి హాజరుకానున్నారు. అలాగే జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఇఒ ఇవివిఎన్ ఎస్ఎస్‌బిఎల్ నారాయణ, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు, ఎల్‌హెచ్ టౌన్ హాల్ కార్యదర్శి బేతు కృష్ణారావు, డిఎన్‌ఆర్ విద్యాసంస్థల ప్రెసిడెంట్ జివి.నరసింహరాజు, కార్యదర్శి జి.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ జి.పాండురంగరాజు, జాయింట్ సెక్రటరీ కనకరాజు రామకృష్ణంరాజు, చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి హాజరుకానున్నారు.

శ్రీచింతలపాటి బాపిరాజు మెమోరియల్ హై స్కూల్ ఇదే

మొదటి రోజు అకడమిక్, కల్చరల్ పోటీలు

చిత్రలేఖనం (జూనియర్స్ సీనియర్ సబ్ జూనియర్స్) జనరల్ నాలెడ్జ్ క్విజ్ (సీనియర్స్), మెమోరీ టెస్ట్ (జూనియర్స్ సీనియర్స్), స్పెల్లింగ్ (జూనియర్స్), విచిత్ర వేషాదరణ, ఏక పాత్రాభినయం, (జూనియర్స్ సీనియర్స్ సబ్ జూనియర్స్) శాస్త్రీయ నృత్యం (సీనియర్స్), అభ్యుదయ దేశభక్తి జానపద నృత్యం (జూనియర్స్) విభాగాల్లో నిర్వహించనున్నారు.

రెండో రోజు అకడమిక్ కల్చరల్ పోటీలు

వ్యాసరచన (జూనియర్స్ సీనియర్స్), పద్యం చెప్పడం (సీనియర్స్), మ్యాప్ డ్రాయింగ్ (సీనియర్స్), బెస్ట్ ఫ్రం వేస్ట్ ప్రదర్శనలు (సీనియర్స్, జూనియర్స్), దేశభక్తి అభ్యుదయ గీతాలాపన బృందం (సీనియర్స్), శాస్త్రీయ నృత్య బృందం (జూనియర్స్) జానపద నృత్యం (సీనియర్స్), కోలాటం (సీనియర్స్ జూనియర్స్) విభాగాల్లో నిర్వహించనున్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేయనున్నారు. ప్రశంసాపత్రాలు విద్యార్థులకు మెడల్స్ మెమెంటోలు అందించనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి : బాలోత్సవ కమిటీ

బాలోత్సవ సంబరాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు బాలోత్సవ కమిటీ తెలిపింది. ఈ మేరకు కమిటీ అధ్యక్షులు ఇందుకూరు ప్రసాద్‌రాజు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ పట్టాభి రామయ్య, అసోసియేట్ అధ్యక్షులు గాదల జేమ్స్, చీఫ్ అడ్వయిజర్ చెరుకువాడ రంగసాయి, కోశాధికారి పాకలపాటి సీతారామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లూరి అరుణ్, అసోసియేట్ కార్యదర్శి జి.ధనుష్ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. కల్చరల్, అకడమిక్ విభాగాల నుంచి వందల మంది బాల బాలికలు పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు టిఫిన్, స్నాక్స్, భోజన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

నేడు, రేపు రెండో పిల్లల సంబరాలు

భీమవరం టౌన్: బాలల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి రెండేళ్లుగా వివిధ పాఠశాలల విద్యార్థులకు బాలోత్సవం నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ నెల 28, 29 తేదీల్లో భీమవరం డిఎన్‌ఆర్ విద్యాసంస్థలోని ఎస్‌సిహెచ్ బిఎఆర్‌ఎం హైస్కూల్లో రెండు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బాలోత్సవ నిర్వహణ కమిటీ కార్యదర్శి పట్టాభిరామయ్య తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో సన్నాహాల్లో భాగంగా అధికారులకు ఆహ్వాన పత్రాలను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా డిఇఒ ఇ.నారాయణరావు, చెరుకువాడ రంగసాయి, గాతల జేమ్స్ మాట్లాడుతూ బాలోత్సవాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభిస్తారని, ముగింపు రోజున ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డిఎంహెచ్ఒ మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి పాల్గొంటారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1500 మంది విద్యార్థులు పాల్గొంటారని, 16 అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్ రాజు, ధనుష్ పాల్గొన్నారు.

ఎస్‌సి ఉప వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ వినతుల స్వీకరణ

జిల్లా అధికారులతో కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా ప్రత్యేక సమావేశం

సమాచారం అందజేతపై కచ్చితమైన ఆదేశాలు జారీ

వివిధ సంఘాల నుంచి 132 వినతులు స్వీకరణ

భారీ పోలీస్ బందోబస్తు నడుమ సాగిన ప్రక్రియ

మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్‌మిశ్రా ఏకసభ్య కమిషన్ శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకున్న కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి స్వాగతం పలికి పూలమొక్కలను అందజేశారు. తొలుత ఎస్‌సి ఉప కులాల వర్గీకరణకు సంబంధించి అధికారులతో కమిషన్ ఛైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించిన షెడ్యూల్డ్ కులాలవారీగా వివరాలపై మాట్లాడాలన్నారు. దీంతో తొలుత జెడ్‌పి సిఇఒ సుబ్బారావు మాట్లాడారు. జిల్లాలో ఎంతమంది జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసిలు ఉన్నారు, అందులో షెడ్యూల్ కులాలవారీ వివరాలను తెలిపారు. ఆ తర్వాత పంచాయతీ, విద్యాశాఖ, డిఆర్‌డిఎ, ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్, ఎస్‌సి సబ్‌ప్లాన్‌కు సంబంధించిన అధికారులతోపాటు ఇతర అధికారులు ఆయా శాఖలవారీగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలతోపాటు ఇతర అంశాలను కమిషన్ ఛైర్మన్‌కు వివరించారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి ఆయా శాఖలవారీగా పూర్తి సమాచారాన్ని వెంటనే కమిషన్‌కు సమర్పించాలని ఛైర్మన్ ఆదేశించారు. దీనిపై జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఆయన సూచించారు. జిల్లాలోని ఆయా శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఉప కులాలవారీగా సమాచారం అందించాలన్నారు. సమావేశంలో కలెక్టర్, ఎస్‌పితోపాటు డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

132 వినతుల స్వీకరణ

జిల్లా అధికారులతో సమావేశం ముగిసిన అనంతరం కమిషన్ ఛైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ వినతులు, అభ్యంతరాలను స్వీకరించారు. మొత్తం 132 వినతులు కమిషన్‌కు అందాయి. సుమారు 600 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాపు 300 మందితో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగులు, న్యాయవాదులు వినతులు అందించిన వారిలో ఉన్నారు. వినతులు స్వీకరణతోపాటు వారి అభిప్రాయాలు సైతం కమిషన్ ఛైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా విన్నారు. వీటిని పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని స్పష్టం చేశారు. ఇంకా ఏమైనా వినతులు ఉంటే విజయవాడ గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌కు అందించవచ్చునని తెలిపారు.

ఆస్తి కోసమే డెడ్‌బాడీ డోర్ డెలివరీ

ముగ్గురు అరెస్టు , కోర్టుకు నిందితులు, రిమాండ్

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నిందితులను మీడియాకు చూపుతూ మాట్లాడుతున్న ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆస్తి కోసమే ఒక అమాయకుడిని హత్య చేసి, ఆ మృతదేహాన్ని డోర్‌డెలివరీ చేసినట్లు పోలీసులు నిర్ధారించి ముగ్గురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలను భీమవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి వెల్లడించారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం మల్లంపూడికి చెందిన తిరుమాని శ్రీధర్ తన పేరును చేకూరి శ్రీధర్ వర్మ, సిద్ధార్థ వర్మ అనే పేర్లతో మండల కేంద్రం కాళ్లలోని గాంధీనగరంలో నివాసం ఉన్నాడు. శ్రీధర్ 2010లో కాళ్ల మండలం ఇస్కులంకకు చెందిన చిప్పల రాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన విజయవాడకు చెందిన వివాహిత పెన్మెత్స సుష్మను కాళ్ల తీసుకొచ్చి అద్దె ఇంట్లో ఉంచి సహజీవనం చేస్తున్నాడు. అప్పటికే ముదునూరి రేవతిని ప్రేమ పెళ్లి చేసుకుని గాంధీనగరంలో ఉంచాడు. సుష్మను బంధువుగా రేవతికి పరిచయం చేసి ఆమెను గాంధీనగరంలో ఉంచాడు. ఉండి మండలం యండగండికి చెందిన ముదునూరి రంగరాజు, హైమావతి దంపతులకు తులసి పెద్ద కుమార్తె. రెండో కుమార్తె శ్రీధర్‌వర్మ రెండో భార్య రేవతి. తులసికి నిడదవోలుకు చెందిన సుబ్బరాజుకు ఇచ్చి వివాహం చేసి అరెకరం పొలం రాశారు. తులసి భర్త ఇల్లు విడిచి వెళ్లిపోవడంతో ఆమె తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. అయితే కుటుంబంలో విబేధాలతో పాలకోడేరు మండలం గరగపర్రులో అద్దె ఇంట్లో తన కుమార్తెతో కలిసి ఉంటోంది. రేవతికి కూడా తల్లిదండ్రులు 50 సెంట్లు ఇవ్వగా మిగిలిన ఎకరం 43 సెంట్ల పొలం తండ్రి రంగరాజు పేరున, ఇల్లు తల్లి హైమావతి పేరున ఉంది. తమ తదనంతరం ఆస్తిని ఇద్దరు కుమార్తెలకు సమానంగా పంచుతామని తల్లిదండ్రులు చెప్పడంతో మొత్తం ఆస్తిని ఎలాగైనా కాజేయాలని శ్రీధర్‌వర్మ రెండో భార్య రేవతితో కలిసి కుట్ర పన్నాడు. యండగండిలో జగనన్న కాలనీలో కేటాయించిన స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రాజమండ్రి క్షత్రియ ఫౌండేషన్ నుంచి గత సెప్టెంబర్ 11, 21 తేదీల్లో ఒక ఆటోలో పెయింట్ డబ్బాలు, టైల్స్ వచ్చాయి. ఫౌండేషన్ తరఫున సాయంగా వీటిని పంపుతున్నట్లు శ్రీధర్‌వర్మ తులసికి ఫోన్ చేయించాడు. ఈ నెల 19న సాయంత్రం ఐదు గంటలకు ఒక ట్రక్కు ఆటోలో చెక్కపెట్టెలో ఎలక్ట్రికల్ సామగ్రి పేరిట డెడ్‌బాడీని తులసి తండ్రి ముదునూరి రంగరాజు ఇంటికి పంపి, ముందుగానే తులసికి సమాచారం ఇచ్చారు. పెట్టె తెరవగానే మృతదేహం చూసి కంగారు పడుతున్న తులసికి, పక్కనున్న లెటర్ చదివి విన్పించి మృతదేహాన్ని మాయం చేయడానికి ఆస్తి తన పేరిట రాయాలని, అలాగైతే ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటానని బెదిరించాడు. అయితే తులసి చాకచాక్యంగా బంధువుల ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో శ్రీధర్‌వర్మ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్‌పి 11 బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా శ్రీధర్‌వర్మ వద్దకు పనికి వచ్చే బర్రె పర్లయ్య ఒంటరిగా జీవిస్తున్నాడని గుర్తించి పని పేరిట మద్యం పోయించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీ రాత్రి శ్రీధర్‌వర్మ, సుష్మ పర్లయ్యకు మద్యం ఇప్పిస్తామని చెప్పి కారు ఎక్కించుకుని స్పృహలో లేని స్థితి వరకూ మద్యం తాగించారు. అనంతరం పర్లయ్యను వాండ్రం గ్రామంలో పొలాల వైపు తీసుకొచ్చి వెనుక సీట్లో ఉంచి మెడకు వైరు బిగించి శ్రీధర్‌వర్మ, సుష్మ కలిసి హత్య చేశారు. అనంతరం సుష్మను కోపల్లెలో దించేసి ఇస్కులంక వెళ్లిపోయాడు. మరుసటి రోజు కోపల్లె వచ్చి కారు అక్కడే వదిలి కైకలూరు వెళ్లి చెక్క పెట్టి తయారు చేయించారు. కాళ్లకూరు రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పర్లయ్య మృతదేహాన్ని పెట్టెలోకి చేర్చి పార్శిల్‌గా తయారు చేశారు. అక్కడే రూ.1.30 కోట్లు ఇవ్వాలని అజ్ఞాత వ్యక్తి రాసినట్లుగా లేఖ సుష్మతో రాయించి దాన్ని పెట్టెకు అంటించారు. ఆ పెట్టెను కారులో పెట్టుకుని గాంధీనగరం చేరుకున్నారు. 19వ తేదీన శ్రీధర్‌వర్మ, సుష్మ కలిసి గణపవరం మండలం కేశవరం చేరుకున్నారు. అక్కడ పిప్పరకు చెందిన ఆటో మాట్లాడుకుని చెక్కపెట్టె పార్శిల్ యండగండిలో అందజేయాలని చెప్పారు. శ్రీధర్‌వర్మ వెంటనే రేవతికి ఫోన్ చేసి చెక్కపెట్టె వస్తున్న విషయం తెలిపి వెనుక కొద్దిసేపటికి తాను కూడా అక్కడికి చేరుకుని తులసిపై ఒత్తిడి తెచ్చి ఆస్తి రాయించుకునే ప్రయత్నం చేశాడు. పోలీసుల రాకతో అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ నెల 26న పోలీసులు శ్రీధర్ వర్మ, సుష్మను కానూరు డంపింగ్ యార్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. తర్వాత రేవతిని కూడా యండగండిలో ఆమె ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో ఎఎస్‌పి భీమారావు, భీమవరం డిఎస్‌పి జయసూర్య, ఆకివీడు సిఐ వి.జగదీశ్వరరావు, ఉండి ఎస్ఐ ఎమ్‌డి.నసీరుల్లా, కాళ్ల ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, ఆకివీడు ఎస్ఐ హెచ్.నాగరాజు పాల్గొన్నారు.

కోర్టుకు నిందితులు : రిమాండ్ విధింపు

ఉండి: అత్త మామలను, వదినను బెదిరించి ఆస్తి కాజేసేందుకు అమాయకుడిని హత్య చేసి ఆ డెడ్‌బాడీని పార్శిల్‌లో పంపిన కేసులో ప్రధాన నిందితుడు తిరుమాని శ్రీధర్ వర్మ, అతనికి సహకరించిన రెండో భార్య రేవతి, సహజీవనం చేస్తున్న సుష్మ (విజయలక్ష్మి)ను ఉండి పోలీసు స్టేషన్ నుంచి శుక్రవారం సాయంత్రం భీమవరంలోని కోర్టుకు తరలించారు. కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు ఉండి ఎస్ఐ మహ్మద్ నసీరుల్లా తెలిపారు.

సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు సమ్మె కాల ఒప్పందాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరం 6వ డివిజన్ మాస్టర్ పాయింట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ గత డిసెంబర్‌లో సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం సమ్మె ఒప్పందం చేసుకుందని, నేటికీ సమ్మె ఒప్పందాలను అమలు చేయలేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రకటించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు సరైన సౌకర్యాలు లేవన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు దుస్తులు, సబ్బులు, కొబ్బరి నూనె ఇవ్వలేదని, వెంటనే అందించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల సహజ మరణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మె ఒప్పందాలను అమలు చేయకపోతే సంక్రాంతి తర్వాత ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాపు రాజు, నీలాపు అప్పన్న, మాడుగుల రత్నం, ఆశీర్వాదం, వెల్దుర్తి దుర్గారావు ఇమ్మానుయేలు, గర్రాజు రమణమ్మ పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

ఒకే రోజు రూ.3 కోట్ల విలువైన పనులకు శ్రీకారం - జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో ప్రజా కూటమి ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని, వచ్చే సంక్రాంతి నాటికి అభివృద్ధి కార్యక్రమాలన్నీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి, దిగమర్రు, కొత్తపేట గ్రామాల్లో రూ.3 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేసి, శిలాఫలకాలను మంత్రి ఆవిష్కరించారు. మంత్రి స్వయంగా మోటార్ సైకిల్ నడుపుతూ ఆయా గ్రామాల్లో ప్రజలను పలకరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల నుంచి అమరావతి రాజధాని నిర్మాణాలు, పోలవరం నిర్మాణం, పరిశ్రమలు ఏర్పాటు, పారిశ్రామిక వేత్తలను మన రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఒకే రోజు మూడు చిన్న గ్రామాల్లో రూ.3 కోట్ల విలువైన పనులంటే సామాన్య విషయం కాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం చేసి సంక్రాంతిలోపు ప్రారంభోత్సవాలు చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు డిఎస్‌సి ద్వారా 16500 పోస్టులు, హెక్టారుకు ఇన్‌పుట్స్ సబ్సిడీ రూ.16 వేల నుంచి రూ. 25 వేల వరకూ పెంచామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల అరాచక పాలనతో విద్యుత్తు రంగాన్ని సర్వనాశనం చేసి ప్రజలపై భారం మోపిందన్నారు. నేడు విద్యుత్తు రంగంపై ధర్నాకు పిలుపు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. గత చంద్రబాబు పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచకపోవడమే కాకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మోహన్, సర్పంచులు రాపాక నగేష్ కరుణాకర్, కవురు భారతి భాస్కరరావు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి కెఎస్ఎస్ఎస్ శ్రీనివాసరావు, గృహనిర్మాణ శాఖ ఇఇ పైడికొండల వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

శిలాఫకలాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వైసిపి ఆందోళనలు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించే వరకూ ఉద్యమం ఆగదని వైసిపి నియోజకవర్గ కన్వీనర్ పివిఎల్ఎన్.నరసింహరాజు అన్నారు. శుక్రవారం నరసింహ రాజు ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వైసిపి నేతలు ముట్టడించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వేగేశ్న వెంకటరాజు, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి, నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, మంతెన సునీల్ వర్మ పాల్గొన్నారు.

ఆచంట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని వైసిపి జెడ్‌పిటిసిలు గూడూరు పెద్దిరాజు, గౌరీ సుభాషిని అన్నారు. మాజీ ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో ఆచంటలోని సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం జూనియర్ ఇంజినీర్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు పెడితే ధ్వంసం చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ చెప్పారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమరుస్తున్నారని విమర్శించారు. విద్యుత్ భారాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర సీతారాం, జక్కంశెట్టి చంటి, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పెంచడాన్ని వ్యతిరేకిస్తూ మాజీ డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు హౌసింగ్ బోర్డు కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిఇఇ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ మాట్లాడుతూ తాము అధికారంలోకొస్తే కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొలుకూరి ధర్మరాజు, జిడ్డు హరిబాబు, కర్రి భాస్కరరావు, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం : అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని నమ్మించిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు గడవకుండానే ప్రజలపై కోట్ల భారాన్ని మోపి అన్ని వర్గాలనూ దగా చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ పోరుబాటలో భాగంగా పార్టీ కార్యాలయం నుంచి రుస్తుంబాద ఇపిడిసిఎల్ కార్యాలయం వరకూ నిరసన ప్రదర్శన చేశారు. అక్కడ ధర్నా చేసి విద్యుత్ శాఖ ఇఇ మధుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రసాద్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. ఇప్పటికైనా మోసపూరిత కబుర్లు మాని హామీలు అమలు చేయలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, ఎంపిపి మైలాబత్తుల సోని, ఉంగరాల రమేష్ నాయుడు, కామన నాగిని, బొక్కా రాధాకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : నిరసన తెలుపుతున్న వైసిపి నేతలు

కోస్టల్ లోకల్ బ్యాంక్ సేవలు ఎనలేనివి

బ్యాంక్ భీమవరం శాఖ మేనేజర్ సుధాకర్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కోస్టల్ లోకల్ బ్యాంక్ సమాజానికి 25 సంవత్సరాలు నమ్మకమైన సేవలందించిందని, 1999లో ఉన్నత లక్ష్యాలతో బ్యాంకు స్థాపన జరిగిందని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ భీమవరం శాఖ మేనేజర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ దేశంలోనే మొట్టమొదటి లోకల్ ఏరియా బ్యాంక్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను కోస్టల్ బ్యాంక్ భీమవరం శాఖలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ చిన్న ప్రాంతీయ బ్యాంక్ నుండి ప్రస్తుతం ఆర్థికంగా సుస్థిరమైన బ్యాంక్ ఎదిగిన క్రమాన్ని ఆయన వివరించారు. 120 శాఖల నెట్ వర్క్ విస్తరణ, పొరుగు రాష్ట్రాలకు విస్తరణ ఉంటుందని తెలిపారు. మా కస్టమర్ల విశ్వాసం, ఉద్యోగుల అంకిత భావం సమాజం మద్దతు మరెన్నో సంవత్సరాలు సేవలందించడానికి ప్రేరణ ఇచ్చాయని తెలిపారు. కస్టమర్లకు అనుగుణంగా బ్యాంకింగ్ పరిష్కారాలు, డిజిటల్ మార్పులు వినూత్న ఉత్పత్తులను అందించడంలో బ్యాంక్ నిబద్ధతను పునరుద్ఘాటించారని అన్నారు. ముందుగా ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య బృందంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, బిపి, షుగర్, కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అదేవిధంగా బ్యాంకు ఉత్పత్తులను వివరిస్తూ 4కె వాక్ థాన్ నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ఫణికుమార్, అవినాష్, దుర్గాపావని, వెంకట్ బాబు, కిరణ్ కుమార్ ఖాతాదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంక్ భీమవరం శాఖ మేనేజర్ సుధాకర్

సిపిఎం బహిరంగ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆకివీడు

జనవరి మూడో తేదీన భీమవరంలో జరిగే సిపిఎం భారీ బహిరంగ సభకు ఆకివీడు నుంచి కార్మిక వర్గం తరలి వెళ్తుందని సిపిఎం ఆకివీడు ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం జిల్లా మహాసభల కరపత్రాలను, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ 2025 జనవరి 3, 4, 5 తేదీల్లో భీమవరంలో సిపిఎం జిల్లా మహాసభలు జరుగనున్నాయని, ఈ సందర్భంగా జనవరి మూడో తేదీన భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ బహిరంగ సభకు ఆకివీడు నుంచి పెద్ద ఎత్తున ప్రజానీకం హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రజా సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందించుకున్నారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు వాగ్దానాలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గడిచిన ఆరు నెలల్లోనే ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందని గుర్తు చేశారు.

రేపు తణుకులో మానవత సమావేశం

పెనుమంట్ర : ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం తణుకు రోటరీ క్లబ్ భవనంలో తణుకు డివిజన్‌లోని మానవత సంస్థ సభ్యుల సమావేశం జరుగుతుందని జిల్లా మానవత కన్వీనర్ కొత్త సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ సమావేశంలో అత్తిలి, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పాలకొల్లు మండల బాధ్యులు పాల్గొంటారని అన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మానవత సంస్థ వ్యవస్థాపకులు నిమ్మనపల్లి రామచంద్రారెడ్డి హాజరు అవుతారని, ఈ సమావేశానికి ప్రతి మండలం నుంచి కనీసం ఐదుగురు సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం

పెనుమంట్ర : ఈనెల 29వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల కమిటీ సమావేశం జరుగుతుందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వీఆర్‌ఒలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పలు కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు కోరారు.

నేడు దుంపగడపలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఆకివీడు : వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28 శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ, మెడ్‌ప్లస్ కంపెనీలు ఈ ఉద్యోగ ఎంపిక కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. 18-35 సం. మధ్యవయస్సుగల అర్హులని ఆమె చెప్పారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ క్రింది లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని చెప్పారు. ఇతర వివరాలకు ఈ క్రింది నంబర్ డి.శ్రీనివాసకుమార్ 8688594244 సంప్రదించాలని తెలిపారు. %Naipunyam.ap.gov.in%లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

5న రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్

తణుకు : 59వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ జనవరి 5వ తేదీన వేల్పూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు గ్రామ సర్పంచి వినుకొండ శ్రీనివాస్, హెడ్ మాస్టర్ కేతా మునీంద్రరావు, అసోసియేషన్ ట్రెజరర్ కటికితల బాబురావు పాల్గొన్నారు.

లాకుల మరమ్మతుకు చర్యలు

నరసాపురం : సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నియోజకవర్గంలోని అన్ని లాకుల్ని మరమ్మతు పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పాత నవరసపురం వద్ద లాకుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలించారు. లాకుల వద్ద చెత్త ఉండిపోవడం వల్ల తమ సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు పొత్తూరి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో చర్చించారు. తక్షణం సమస్యను పరిష్కరించి రైతులకు నీరందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. శివారు ప్రాంతాలకు నీరు అందేలా కృషి చేస్తున్నామన్నారు. రుస్తుంబాద నీటి సంఘం ప్రెసిడెంట్, డిసి వైస్ ప్రెసిడెంట్ అందే రామకృష్ణ, నర్సాపురం నీటి సంఘం ప్రెసిడెంట్ పెదపాటి శాంతరాజు పాల్గొన్నారు.

'రైతులకు మేలు చేసేలా పనిచేయాలి'

కొవ్వలికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మార్కండేయులు

నరసాపురం : రైతులకు మేలు చేసేలా నీటి సంఘాలు పనిచేయాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు గుబ్బల మార్కండేయులును ఘనంగా కలిసి బొకే అందించారు. గత ప్రభుత్వం రైతుల్ని, పంట కాల్వల్ని పట్టించుకోవడం మానేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి రైతులకు దగ్గర చేస్తున్నారు. అంకితభావంతో పని చేసి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. సంకు భాస్కర్, కొరాడ పాపారావు, అరేటి వేణు, కుక్కల రవి, కొట్ల రాజా పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కారు ఢీకొని వృద్ధుడు మృతి

తణుకు రూరల్ : మండలంలోని దువ్వ వద్ద జాతీయ రహదారిపై కారు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వృద్ధుడు రోడ్డుపై నడిచి వెళుతుండగా తాడేపల్లిగూడెం వైపు నుంచి తణుకు వైపు వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొనడంతో తలకు గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని తణుకు ప్రాంతీయ ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతుడు ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

బెల్టుషాపు నిర్వాహకుల అరెస్ట్

తణుకు : బెల్టు షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మణికంఠ రెడ్డి అన్నారు. శుక్రవారం తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇరగవరం మండలం ఐనపర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నేతల శ్రీనును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో ఎస్‌ఐ ఆర్.మధుబాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీమన్నారాయణ, ఎన్.ఎ.స్వామి, కానిస్టేబుల్ కె.నాగరాజు పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వేర్వేరు ప్రదేశాలలో దాడులు నిర్వహించి, ఒక కేసు నమోదు చేసి, ఒక ముద్దాయిని అరెస్ట్ చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటమోహన్, దొరబాబు, సిబ్బంది కలిసి శుక్రవారం పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక ముద్దాయిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 14 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నరసాపురం : సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సిఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం ట్రాన్స్‌పోర్టుతో కలిసి మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి, కట్టావారిపాలెం, కుక్కులవారితోటల్లో దాడులు నిర్వహించారు. ముత్యాలపల్లి గ్రామానికి చెందిన ఎం.జాన్ బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో దాడి చేసి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో ఎస్‌ఐ ఖాసిం, రమాదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యుటిఎఫ్ సీనియర్ నేత మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

ఆదినారాయణ(ఫైల్ ఫొటో)

రాయకుదురుకు చెందిన యుటిఎఫ్ సీనియర్ నేత చల్లా ఆదినారాయణ గురువారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని యుటిఎఫ్ మండల నాయకులు శుక్రవారం సందర్శించి నివాళి అర్పించారు. ఆదినారాయణ యుటిఎఫ్ ఉద్యమాలలో పాల్గొని నిబద్ధతో ఉపాధ్యాయుల సమస్యల పట్ల పోరాడారు. ఆయన పోరాటాన్ని స్మరించుకుని ఆయన భౌతికకాయంపై యుటిఎఫ్ జెండా కప్పారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన వారిలో సీనియర్ నాయకులు ఎన్.భానుమూర్తి, వి.భాస్కరరావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎన్.ప్రసాద్ బాబు, ముద్రగళ్ల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, జివి.రమణ, అంగర వేణుగోపాలకృష్ణ, సాంబమూర్తి, వెంకటాచార్యులు ఉన్నారు.

ఇవిఎం గొడౌన్లలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు చేపట్టే సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇవిఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ గొడౌన్‌ను సందర్శించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎపిఎస్‌డబ్ల్యూహెచ్‌సి గొడౌన్స్‌లో ఉన్న ఇవిఎం గొడౌన్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఇవిఎంలు భద్రపర్చిన గొడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సందర్శించి, తనిఖీలు చేపట్టి, సంబంధిత రిజిస్టర్‌లో సంతకాలు చేసినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలైన బ్యాలెట్ యూనిట్స్ పార్లమెంటు నియోజకవర్గాల, అసెంబ్లీ నియోజకవర్గాల వారీ ఇవిఎం యూనిట్ (బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్స్) నిరంతర సీసీ కెమెరాల ప్రత్యక్ష పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఉంచడం జరిగిందన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును, స్ట్రాంగ్ రూమ్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఇవిఎం నోడల్ అధికారి డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి ఎలక్షన్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్యాంబాబు, ఐఎన్‌సి పి.వంశీరెడ్డి, గెద్దాడ తులసీరామ్, ఎం.రత్నరాజు, రెవెన్యూ పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతి బాధాకరం

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటపతి వర్మ

ప్రజాశక్తి - పాలకొల్లు

గొప్ప ఆర్థిక వేత్త, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి ఇకలేరంటే బాధగా ఉందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.వెంకటపతి వర్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంలో సెప్టెంబర్ 4న మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఇంటి వద్ద న్యూఢిల్లీలో తీయించుకున్న గ్రూప్ ఫోటో ఇప్పటికీ ఉంది. 2006లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిసి గ్రూప్ ఫోటో తీయించుకున్నారు. అప్పుడు ప్రధాని మాతో చాలా క్లోజ్‌గా మూవ్ అయ్యారని, దేశ ఆర్థిక అంశాల గురించి వివరించారని, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారని వర్మ శుక్రవారం 'ప్రజాశక్తి'కు తెలిపారు. అటువంటి మన్మోహన్ సింగ్ లేరంటే బాధగా ఉందని, ఆయన మృతికి సంతాపం తెలిపారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి'

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజీషియన్‌ను నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని పెదపుల్లేరు, పాములపర్రు శివారు కొండగూడెం ప్రాంతంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో డాక్టర్ సాయిచంద్ర పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత శీతాకాలంలో వైరల్ జ్వరాలు అధికమవుతున్నాయని, వైరల్ జ్వరాలు సోకిన ప్రతి ఒక్కరూ అధైర్య పడకుండా ద్రవరూప ఆహారాన్ని తీసుకోవాలని, వెంటనే దగ్గరలోని వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. అనంతరం రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించడం జరిగిందని వారు తెలిపారు. గర్భిణులు షుగర్ వ్యాధిగ్రస్తులను ప్రత్యేకంగా పరీక్షించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, 104 సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నరసింహమూర్తి కుటుంబాన్ని ఆదుకోండి

ఉండి : ఇటీవల ప్రమాదవశాత్తు రెండు కాళ్లు విరిగిపోయి, తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాన్యం నరసింహమూర్తి కుటుంబాన్ని దాతలు ఆదుకొని, తమ దాతృత్వాన్ని చాటుకోవాలని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సత్తి బ్రహ్మ రెడ్డి, డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. శుక్రవారం ఉండి మండలం చెరుకువాడ గ్రామంలో తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మాన్యం నరసింహమూర్తి కాళ్లు విరిగిపోవడంతో ఆయన కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతుందని సమాచారం అందుకోగానే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నరసింహమూర్తి కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, వైద్య నిమిత్తం రూ.2,500 నగదును నరసింహమూర్తి భార్య వెంకటలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెనుగొండ అభివృద్ధికి కృషి చేయాలి

పెనుగొండ : పెనుగొండ అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం, పెనుగొండలో శుక్రవారం ఎంపిపి పూతినీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సాధారణ సమావేశం జనరల్ బాడీలో భాగంగా ముఖ్య అతిథిగా ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ముందుగా మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కి అశ్రునివాళులు అర్పించారు. అనంతరం పితాని మాట్లాడుతూ మండలంలోని అన్ని డిపార్ట్మెంట్‌లతో రివ్యూ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశమునకు మండలంలోని అందరు ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'పిఎంపిలను గ్రామీణ వైద్యులుగా గుర్తించాలి'

తాడేపల్లిగూడెం: పిఎంపిలను గ్రామీణ వైద్యులుగా గుర్తించాలని ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా 62వ వార్షికోత్సవ సభలో పలువురు వక్తలు ఉద్ఘాటించారు. శుక్రవారం స్థానిక తాళ్ల ముదునూరుపాడు పిఎంపిల అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె పరమేశ్వరులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి విబిటి.రాజు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులుగా గుర్తింపు కోసం గత ఆరు దశాబ్దాలకు పైబడి అసోసియేషన్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పిఎంపిలను గుర్తించేందుకు కమ్యూనిటీ పారా మెడికల్ కోర్సును ప్రవేశపెట్టారన్నారు. ఆ సమయంలోనే అసోసియేషన్ పేరును కూడా కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా సంఘం పేరును మార్పు చేయడం జరిగిందన్నారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా పారామెడిక్స్ కోర్సును కొనసాగిస్తూ 465 నెంబర్ జిఒను తీసుకువచ్చారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పారామెడిక్స్ కోర్సు తిరిగి ప్రవేశపెట్టాలని అసోసియేషన్ తరపున కోరుతున్నామన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు విన్నవించనున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వం పిఎంపిలను గ్రామీణ వైద్యులుగా గుర్తించాలని ఈ సభలో ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సభలో డాక్టర్ ఎన్ఎల్.రావు, డాక్టర్ గుడ్ల సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.చిట్టి సుభాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ల రాంబాబు, జిల్లా కోశాధికారి జితేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జయరాం, కేంద్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు హాజరయ్యారు.

పేరుకే ఆధార్ ఉచిత నమోదు కేంద్రం

సేవలు మాత్రం శూన్యం
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఉండి

పేరుకే ఆధార్ ఉచిత నమోదు కేంద్రం కానీ సేవలు మాత్రం శూన్యం. ఉండి పంచాయతీ పరిధిలోని ఆధార్ కేంద్రంలో ఆధార్ నమోదుకు వచ్చిన వారికి సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఉండి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ వద్దకు ఆధార్ నమోదు కోసం వెళ్తే నిత్యం సర్వర్ పనిచేయట్లేదు అనే సమాధానం ఇస్తూ బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్దకు వెళ్లాలని సూచించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గ్రామపంచాయతీలో ఒకటి, రెండు సచివాలయాలు పనిచేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఆపార్ తప్పనిసరి చేయడంతో విద్యార్థులు, చిన్నారులు ఆధార్ నమోదు కోసం వెళుతుంటే సర్వర్ పనిచేయట్లేదు అనే సమాధానం తప్ప సేవలందించట్లేదని పలువురు మండిపడుతున్నారు. గతంలో మీసేవ, పోస్ట్ ఆఫీస్, తదితర కార్యాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రం ఉండేదని, అక్కడికి వెళ్లగానే వెంటనే ఆధార్ సేవలు అందించే వారని, కానీ నేడు సచివాలయాలలో డిజిటల్ అసిస్టెంట్లకు ఆ బాధ్యత అప్పగించడం వల్ల వారి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు. సేవలందించకపోవడంతో విద్యార్థులకు కష్టాలు తప్పట్లేదని, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామ సచివాలయాల వద్ద ఆధార్ నమోదు కేంద్రంలో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శివవర్మ సహకారం అభినందనీయం

టిడిపి గ్రామ అధ్యక్షులు కంతేటి శ్రీనివాసరాజు

శ్రీనివాసరాజును సత్కరిస్తున్న సంఘ పెద్దలు

కాళ్ల : ప్రాతళ్లమెరక గ్రామాభివృద్ధిలో ప్రముఖ దాత విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ అధినేత వేగిరాజు శివవర్మ ఆర్థిక సహకారం అభినందనీయమని టిడిపి గ్రామ అధ్యక్షులు కంతేటి శ్రీనివాసరాజు అన్నారు. ప్రాతళ్లమెరక గ్రామంలో పెదపేట, చినపేటలో ఉన్న సిబిసిఎన్‌సి చర్చిల్లో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు. ఈ సత్కారంలో కంతేటి సుబ్బారాజు మాట్లాడుతూ వేగిరాజు శివవర్మ ఉన్నత స్థానంలో ఉండి పుట్టిన గ్రామానికి మేలు చేకూర్చాలన్న సంకల్పంతో గ్రామంలో అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగమైన కార్యక్రమాలు చేపట్టడం గర్వించతగ్గ విషయమన్నారు. ప్రముఖ దాత శివ వర్మ, టిడిపి గ్రామ అధ్యక్షులు కంతేటి శ్రీనివాసరాజు, కంతేటి సుబ్బారాజు, మంతెన పెద్దిరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు సిఆర్ డేవిడ్ రాజు, సిహెచ్.లాజర్, జె.సంసోన్, బి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ఉండి : అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ నాగార్జున

ప్రజాశక్తి - ఉండి

సరిహద్దు వివాదాలు లేకుండా భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు సరైన వేదికగా ఉన్నాయని ఉండి మండల తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. శుక్రవారం ఉండి మండలం పాములపర్రు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించామని, నేడు జరిగిన రెవెన్యూ సదస్సులో నలుగురు కుటుంబ సభ్యులు తమ ఎల్పి నెంబర్లను విడదీయాలని అర్జీ చేసుకున్నట్లు వారు తెలిపారు. గ్రామస్తులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచి కేసన శాంతి కుమారి, బలుసులరావు, ఎంపిటిసి ఎడవెల్లి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు తోట శ్రీరాములు, మండల సర్వేయర్ రత్నావళి, గ్రామ సర్వేయర్ సాయి, ప్రజలు పాల్గొన్నారు.

మొగల్తూరు : రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి అందిన అర్హత ఉన్న వినతులు అన్నింటిని పరిష్కరిస్తామని తహశీల్దార్ కె.రాజ కిషోర్ అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి కొత్తట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ రెవెన్యూ సదస్సులను గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి వినతులు అందించి, తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆయా సదస్సులో పదిమంది రైతులు వినతులు అందించారని ఆయన తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజలు ఇచ్చిన అధికారంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలలో లబ్ధి కలిగించడమే లక్ష్యంగా పనిచేస్తుందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్టేరులో శ్రీవేణుగోపాలస్వామి ఆడిటోరియంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. తొలుత కీర్తిశేషులు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించడంతో మౌనం పాటించిన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ప్రజల నుంచి నేరుగా సంక్షేమ పథకాల అర్జీలను స్వీకరించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి పలువురు లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. గత ప్రభుత్వం పేదవాడి సొంత ఇల్లు కల నిజం చేయాలని, పేద వాడి నుంచి రూ.50 వేల నుంచి 80 వేల పట్టాలు అమ్ముకున్నారని ఆయన ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రెండున్నర సెంట్ల భూమి పేదవాడికి ఇవ్వాలని ఆలోచిస్తుందని అన్నారు. ఇంటి నిర్మాణానికి రెండున్నర లక్షలు మంజూరు చేస్తుందని చెప్పారు. గత ఐదేళ్లలో సంక్షేమ పథకాల ముసుగులో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో పేద వాడి బియ్యం, ఇసుక మద్యం అక్రమంగా తరలింపుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. టిడిపి అధ్యక్షుడు టి.శ్రీనివాస్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కర్రి అచ్యుత్ రామిరెడ్డి, వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, తేతలి రాజారెడ్డి, రాంబాబు, విశ్వనాథం పాల్గొన్నారు.

లేహ్యం ఫుడ్ పరిశ్రమ ఇబ్బందులు తొలగించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రతాప్

తణుకు : లేహ్యం ఫుడ్ పరిశ్రమ వల్ల ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజా ప్రతినిధులు, అధికారులు తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొన్న ప్రతాప్ మాట్లాడుతూ ఏ పరిశ్రమ అయినా స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటేనే ప్రభుత్వం నుంచి అనుమతులు ఇవ్వాలని అన్నారు. తేతలి గ్రామ పరిధిలో ఉన్న ఈ పరిశ్రమ పశువధ వల్ల వస్తున్న దుర్వాసనకు స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ఈ పరిశ్రమకు అన్ని రకాల అనుమతులు గతంలోనే కేంద్రం నుంచి ఇచ్చారని గుర్తు చేశారు. ఈ పరిశ్రమ వ్యర్థాల ద్వారా వస్తున్న భరించలేని దుర్వాసన పీల్చడం వల్ల ఆహారం తిన్న, తాగిన అనేక అనారోగ్య సమస్యలు ఎదురౌతున్నాయని తెలిపారు. ఇక్కడ వధించిన మాంసాన్ని ఇతర దేశాలకు పంపుతున్నారని అన్నారు. ఈ సమస్య పెద్దది కాకముందే తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత అనేక సంవత్సరాల నుంచి పరిశ్రమల ద్వారా వస్తున్న వ్యర్థాలు, జలాలు వల్ల కాలుష్య సమస్యలతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సిపిఎం ఆందోళనలు చేస్తున్నదని తెలిపారు. అవసరమైతే ఈ సమస్యలపై ఒక కమిటీ వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమ ద్వారా వస్తున్న వాసన, పొల్యూషన్ వంటి సమస్యలపై ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని సిపిఎం కోరుతుందని ప్రతాప్ అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి, గుబ్బల గోపి, గార రంగారావు, వి.వెంకటేశ్వర రావు, కె.నాగరత్నం పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు

పాలకొల్లు రూరల్ : రోటరీ యూత్ సర్వీస్ క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వల్లంపర్రు మాంటిస్సోరి పాఠశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ముఖ్య అతిథి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు వినోదంతో పాటు, మానసిక వికాసాన్ని పెంపొందించడంలో దోహదపడతాయన్నారు. ప్రతిఒక్కరూ పాఠశాల స్థాయి నుంచి చదువుతో పాటు ఇటువంటి క్రీడలను ప్రోత్సహించాలని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అని అన్నారు. విద్యార్థులు చదువులోనూ, క్రీడల్లోనూ బాగా రాణించి, దేశానికి, సమాజానికి ఉపయోగపడాలన్నారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రపంచ ఛాంపియన్ గుకేష్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రోటరీ యూత్ సర్వీస్ డైరెక్టర్ మద్దాల వాసు పాల్గొన్నారు.

మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా వసంతరావు


వసంతరావును అభినందిస్తున్న ఎంఎల్ఎలు

నరసాపురం : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా నరసాపురం మండలం చినమైన వాని లంక గ్రామానికి చెందిన మైలా వసంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు మత్స్యశాఖ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. తీర ప్రాంతంలో వసంతరావుకు మత్స్యకార సంఘాల్లో మంచి పేరు ఉంది. గతంలో చినమైన వాని లంక ఎంపిటిసిగా పనిచేశారు. వసంతరావు ఎన్నికపై ప్రభుత్వ విప్ నాయకర్, ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు పూలమాల వేసి అభినందనలు తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

నరసాపురం: ఎస్‌సి వర్గీకరణ ఎబిసిడిలుగా విభజించడం రాజ్యాంగ విరుద్ధమని ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజీవ్ మిశ్రాకు నరసాపురం ఎస్‌సి నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఢిల్లీ నుంచి ఏలూరుకు విచ్చేసిన ఛైర్మన్‌కు నరసాపురం నియోజకవర్గ మాలల ఐక్యవేదిక నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్‌సి వర్గీకరణ రద్దు చేయకుండా మరిన్ని ఉపకులాలు చేర్చేలా చూడాలని కోరారు. దీనికి ఛైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు పోరాట వేదిక నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజేటి జాన్ కెనడి, కాకిలేటి ఆనంద్, చిన్నం వెంకట్రావు పాల్గొన్నారు.

బైబిల్ క్విజ్ పోటీలు

కాళ్ల : విద్యార్థుల బైబిల్ జ్ఞానాన్ని సవాలు చేయడానికి ఖచ్చితమైన శ్రద్ధతో రూపొందించి క్విజ్ పోటీలు నిర్వహించామని ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సోడదాసి జాకబ్ రాజు అన్నారు. కలవపూడి గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా సిబిసిఎన్‌సి చర్చిలో బైబిల్ క్విజ్ పోటీలు శుక్రవారం డి.సుధీర్ అధ్యక్షతన నిర్వహించారు. విజేతలైన వారికి మొదటి బహుమతి రూ.2 వేలు, 2వ బహుమతి రూ.1500, 3వ బహుమతి వెయ్యి రూపాయల నగదు, మరో ఏడుగురికి ప్రత్యేక బహుమతులను జనవరి ఒకటో తేదీన అందించనున్నారు. సిబిసిఎన్‌సి సంఘ పెద్దలు యు.ప్రకాష్, ఎన్.యాకోబు, సంఘస్తులు, సండే స్కూల్ టీచర్ జి.మనీషా, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

ప్రకటన

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ వారు మా కస్టమర్స్ అయినటువంటి 1. శ్రీ నాలి దుర్గారావు S/o.అప్పారావు, 2. శ్రీమతి నాలి ఉమామహేశ్వరి W/o.దుర్గారావు గార్లకు విజ్ఞప్తి చేయునదేమనగా మీరు మా కంపెనీ నందు లోన్ A/c.No.AP/RAJ/THRD/A000000365 గా తీసుకున్న ఋణం పూర్తిగా చెల్లించి నందున మీరు మాకు హామీగా ఇచ్చినటువంటి ఒరిజినల్ దస్తావేజులను రాజమండ్రి లోని మా బ్రాంచ్ వద్ద నుండి తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. లేని యెడల సదరు దస్తావేజులను మీచే 12-09-2024 తేదీన రిజిస్టర్డ్ క్రయదస్తావేజు (11233/2024) గా క్రయం పొందిన శ్రీ నౌడు గోపాలకృష్ణ గారికి ఇచ్చుటకు నిర్ణయించడమైనది,కావున ఈ విషయంపై మీకు ఎట్టి అభ్యంతరములున్న నేటి నుండి 7 రోజుల లోపు మీరు తెలియజేయగలరు. లేని యెడల ఇది మీ సమ్మతిగా భావించి తగిన హామీ తీసుకొని సదరు దస్తావేజులను నౌడు గోపాలకృష్ణ గారికి అందజేయబడును.

మేనేజర్
హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రాజమండ్రి, 7075767491

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE CUM 2nd ADDITIONAL JUDICIAL 1st CLASS MAGISTRATE : TANUKU
O.S.No.744/2022

Between :
Mangina Srinivasa Rao ...Plaintiff
And
Naragani Veera Swamy ...Defendant

DEFENDANT :
Naragani Veera Swamy, S/o Pulayya, D.No.12-96/1, Relangi Village, Iragavaram Mandal, Tanunu. ...JCJC.

ప్రకటన

పై నెంబరు గ్రంధములోని వాది మీ పై పైలిపిన శ్రీ కోర్టులో ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా సమనులు శ్రీకోర్టు వారి ద్వారా మీకు ఎన్ని సార్లు పంపినను మీరు సదరు దావా సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కాబట్టి శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా వాయిదా తెలియచేయడమైనది. సదరు దావా వాయిదా ది.10.01.2025 తేదీన అయి ఉన్నది. కాబట్టి ఈ దావా విషయములో మీకు ఏవిధమైన అభ్యంతరములు ఉన్నయెడల ది.10.01.2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షములో శ్రీకోర్టు వారు తీర్పు చెప్పుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

తణుకు ది.27.12.2024
వి.వి. సత్యసాయి, అడ్వకేట్, తణుకు. సెల్: 77801 54649

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం.185/22లో
ఓ.యస్.నెం.201/2015

పిటీషనర్/వాది: సానబోయిన సత్యనారాయణ
రెస్పాండెంటు/ప్రతివాదులు : పాలా పద్మనాగమణి వగైరా
6వ రెస్పాండెంటు : జుత్తిగ విజయలక్ష్మి, భర్త నాట్‌నోన్, డోర్‌నెం.2-139, తోకలపూడిపాలెం, తోకలపూడి శివారు, వీరవాసరం మండలం, భీమవరం JCJCJ.
7వ రెస్పాండెంటు : గుత్తుల లక్ష్మీకుమారి, భర్త నాట్‌నోన్, డోర్‌నెం.2-139, తోకలపూడిపాలెం, తోకలపూడి శివారు, వీరవాసరం మండలం, భీమవరం JCJCJ.
8వ రెస్పాండెంటు : వీరవల్లి నాగరాజు, తండ్రి నాగసత్యనారాయణ, డోర్‌నెం.2-139, తోకలపూడిపాలెం, తోకలపూడి శివారు, వీరవాసరం మండలం, భీమవరం JCJCJ.

పిటీషనరు తరపున ప్రకటన

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన వీరవల్లి జానకిరత్నం అనే జానకమ్మ అనే ధనలక్ష్మి చనిపోయినందున 6 టు 8 వారలను ప్రతివాదులుగా చేర్చించవలసినదిగా కోరుతూ పిటీషను దాఖలు చేసినందున మీకు నోటీసు పంపినా అమలు జరుగని కారణంగా కోర్టు వారు Substitute Service ద్వారా నోటీసు అమలుకు ఉత్తర్వులు వేసినందున ది.20-01-2025వ తేదీని మీరు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లుకాని ఎడల మిమ్ములను ఎక్స్‌పార్టీ చేసి ముందు గ్రంథం జరిపించబడును.

//శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము//
కె.యస్.యల్.యన్.ప్రసాద్
అడ్వకేటు, తణుకు.
సెల్: 9848142794

పాలకొల్లు పురపాలక సంఘం
ఆర్.ఓ.సి.నెం.592/2024/ఇ2
మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు, ది.27-12-2024

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘం పరిధి 10వ వార్డు G+1 కాలనీ, చాత్రాయిచెరువు గట్టు, రాజీవ్ నగర్, బ్రహ్మానందరెడ్డి కాలనీ మరియు TIDCO ఇల్లులు ఉన్న ప్రాంతాలతోను మరియు నీటి ఎద్దడి ప్రాంతాలకు అద్దె వాటర్ ద్వారా మంచి నీటి సరఫరా అందించుటకు, పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలో గల 27వ వార్డులోని FCI గోడౌన్ నుండి క్షత్రియ కళ్యాణ మండపం వరకు RCC డ్రైన్ వేయు నిమిత్తం, పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని 20వ వార్డు నందు గల గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం నందు పి.సి.సి.తో స్టోన్ డస్ట్ ఫిల్లింగ్ చేసి పాండు (కొలను) ను రెయిజ్ చేయుటకు (3 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ.32,80,000/- లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్ మెంటు మార్కెట్ నందు ది.28-12-2024వ తేది సాయంత్రం గం॥04-00 ని॥ల నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్ మెంటు మార్కెటు ww.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘం, పాలకొల్లు.